సాక్షి తూర్పుగోదావరి

గురువారం । 10 । అక్టోబర్ । 2024

I



ఎండాకు వణుకు

ఖరీఫ్ సాగు చేతి కొచ్చే తరుణంలో ఎండాకు తెగులు వెంటాడుతోంది. ఇప్పటి వరకూ ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు.


II లో



భగవంతుడు సర్వాంతర్యామి

భగవంతుడు సర్వాంతర్యామి అని పరిపూర్ణానందస్వామి అన్నారు. కాకినాడ శ్రీ పీఠంలో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు.

74 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 74,151 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 12,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో 32.5 టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

కొవ్వూరు: రాష్ట్ర వ్యాప్తంగా 3,400 రైతు సేవా కేంద్రాల ద్వారా 32.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. బుధవారం కాపవరం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రూ.1,674 కోట్లు ధాన్యం కొనుగోలు సొమ్ము చెల్లించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. జిల్లాలో 220 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. జిల్లాలో 2.3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించనున్నట్లు మంత్రి ప్రకటించారు. మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, బత్తుల బలరామకృష్ణ, ఆదిరెడ్డి వాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: దసరా సందర్భంగా గురువారం నుంచి 18వ తేదీ వరకూ విజయవాడ-శ్రీకాకుళం రోడ్ మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు. 07215 నెంబరు గల రైలు విజయవాడ-శ్రీకాకుళం రోడ్ మధ్య ఈనెల 10, 11, 12, 14, 15, 16, 17 తేదీలలో, 07216 నంబరుగల రైలు శ్రీకాకుళం రోడ్-విజయవాడ మధ్య 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో నడవనున్నాయని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర-2047

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రణాళికలను రూపొందించేటప్పుడు క్షేత్రస్థాయి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఆ దిశగా వివిధ రంగాలకు సంబంధించి వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 రూపకల్పనకు అవసరమైన ప్రణాళికల రూపకల్పనకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047.. 2024-25 టు 2028-29 జిల్లా విజన్ ప్లాన్‌పై అభివృద్ధి రంగాల్లోని వివిధ అంశాలపై ప్రముఖులు అందించే సలహాలు సూచనలపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విధి విధానాల మేరకు ప్రైమరీ సెక్టార్ మండల స్థాయిలో కార్యక్రమాలను క్రోడీకరించుకుని జిల్లాస్థాయిలో ప్రణాళికలను రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, వివిధ రంగాల్లోని నిపుణులు పాల్గొన్నారు.

'మద్యం' దరఖాస్తులకు గడువు పెంపు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు అందించేందుకు ఈ నెల 11వ తేదీ రాత్రి 7 గంటల వరకు గడువు పెంచినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ చింతాడ లావణ్య తెలిపారు. 14వ తేదీ ఉదయం 8 గంటలకు రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో డ్రా ద్వారా దుకాణాలు కేటాయిస్తామన్నారు. జిల్లాలో 125 మద్యం దుకాణాలకు బుధవారం రాత్రి 7 గంటల వరకు 2,862 దరఖాస్తులు వచ్చాయని ఆమె తెలిపారు.

- ట్రింగ్.. ట్రింగ్ సైకిల్ బెల్ మోగడంతోనే ఏదో పనిలో నిమగ్నమై ఉన్న అన్నపూర్ణమ్మ వచ్చే వచ్చే అంటూ వేగంగా వచ్చి పోస్ట్‌మేన్ ఇచ్చిన ఉత్తరాన్ని అందుకుంది. మిలటరీలో ఉన్న తన కుమారుడి చేతి రాతలో అతని యోగక్షేమాలు.. ఇంట్లోని వారి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు **కాంక్షిస్తూ అతడి మనసునూ చదువుకుంది. అంతటితో** ఆగక దానిని పదిలంగా ఓ చోట భద్రపరచుకుంది.
- మరో చోట అదే ట్రింగ్‌మన్న శబ్దానికి పరుగున వచ్చిన రమ్య పోస్ట్‌మేన్ చేతి నుంచి చటుక్కున ఉత్తరాన్ని అందుకుని గుండెలకు హత్తుకుంది. కాబోయే భర్త మనసును అక్షర రూపంలో చదువుకుని మురిసి **పోతూ అంతే భద్రంగా దాచుకుంది.**
- హాస్టల్‌లో చదువుతున్న సురేష్ తన తండ్రి పంపే మనియార్డర్ కోసం ఆతృతగా ఎదురుచూసి పోస్ట్‌మేన్ రాగానే ఆనందంతో వచ్చి తీసుకున్నాడు.
- ఎంప్లాయిమెంట్ ఆర్డర్ కోసం ఓ నిరుద్యోగి.. ఊరెళ్లిన భర్త క్షేమ సమాచారాల కోసం ఓ భార్య.. ఇలా ఎన్నో **సందర్భాలు.. భావోద్వేగాలను మోసుకొచ్చే ఉత్తరం** గతంలోకి వెళ్లిపోయింది. వర్తమానంలో దాని ప్రస్తావనే లేదు. కానీ ఆ పాత ఉత్తరాల దొంతరలు నేటికీ పాతకాలపు ఇళ్లలో అక్కడక్కడా కనిపిస్తూనే ఉంటాయి.
- ఇవన్నీ అక్కడికక్కడే చదివి పడేసే మామూలు పోస్టు కార్డులు.. ఉత్తరాలు కావు. తరువాతి కాలపు వెచ్చని **అక్షర స్పర్శలు.**

ఎగిరిపోయిన తోకలేని పిట్ట

- భావ ప్రసారానికి అక్షర రూపం
- స్వాతంత్య్ర సమరాన ఆయుధం
- ఒక్కో ఉత్తరం ఒక్కొక్కరి గుండె చప్పుడు
- జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా లోకోత్తర ప్రస్థానం



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): చెవిలో పెన్సిల్, చేతిలో సంచి, ఖాకీ దుస్తులు, అరిగిన చెప్పులు, ఇంటింటికీ, వీధి వీధికి, పోస్ట్.. పోస్ట్.. అంటూ ప్రతిరోజు తిరిగే తపాలా బంట్రోతు.. అన్న తిలక్ మాటలు మనల్ని ఎక్కడో తాకుతాయి. ఆ గొంతు ఎప్పుడో మాయమైంది. కాలానుగుణంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విప్లవంతో ఈమెయిల్స్, ఎస్ఎంఎస్, వాట్సాప్, చాట్ లాంటివి అందుబాటులోకి రావడంతో తోకలేని పిట్ట కనుమరుగవుతోంది. ఒకప్పటి పోస్ట్‌మేన్ ప్రతిఒక్కరి జీవితంలో.. ఆ మాటకొస్తే కుటుంబ సభ్యుడే అనడం అతిశయోక్తి కాదు. ఉత్తరం మనలోని అనేక భావాలకు ప్రతిరూపం. దూరంలో ఉన్న ఆప్తులను పలకరించేందుకు ఉత్తరాన్ని మించిన సాధనం లేదు.

మనసును తాకే సంబోధన

లేఖలు రాయడంలో పూర్వకాలంలో రాజులకు వారి బిరుదులతో, బ్రాహ్మణులకు గోత్రం, వంశం మొదలైన వాటితో, పుణ్యస్త్రీలకు మహాలక్ష్మీ సమానురాలైన అని, వితంతువులకు గంగా భాగీరథీ సమానురాలైన అని సంబోధనలు.. పెద్ద వారిని, అధికారులను మహారాజశ్రీ, గౌరవనీయులైన అని.. చిన్నలను చిరంజీవి అని సంబోధిస్తూ లేఖాంశం సాగేది. లేఖ రాసిన వారి మనసును చెప్పకనే చెప్పే సంబోధన ఎంతో హృద్యంగా ఉండేది.


స్వాతంత్య్ర ఉద్యమంలో ఆయుధంగా..

స్వాతంత్య్ర ఉద్యమ కాలంలో ఉత్తరం తన విలువ ఏంటో తెలియజేసింది. ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు ఉత్తరం గురించి ఓ మాట అంటూ అన్నం పెట్టింది అంటారు. ఘంటసాల వెంకటేశ్వరరావు అందరికీ ప్రముఖ గాయకుడిగానే తెలుసు. కానీ ఆయన ఓ స్వాతంత్య్ర సమరయోధుడు కూడా. ఆయన జైలు జీవితం కూడా అనుభవించారు. ఆ కాలంలో ఆయన కుటుంబం తిండి లేక కష్టాలు పడుతుంటే భీమవ**రానికి చెందిన విజయ్ కుమార్ రాజు, వారి తల్లి బంగారమ్మకి ఆయన జైల్లో నుంచి ఓ ఉత్తరం రాశారు. నా కుటుంబం తిండి లేక కష్టాల్లో ఉంది అని. ఆ ఉత్తరం అందుకున్న బంగారమ్మ భీమ**వరం పరిసర ప్రాంతాల్లో ఉన్న ఘంటసాల వారి కుటుంబానికి బియ్యం, పప్పులు లాంటివి ఒక ఎడ్ల బండి మీద వారి ఇంటికి చేర్చారు. ఆ విషయం ఘంటసాల వారు మరో ఉత్తరం ద్వారా నా కుటుంబ ఆకలిని తీర్చింది ఉత్తరం అన్నారు. అది ఉత్తరానికున్న ఘనత. ఆ రోజుల్లో ఎందరో స్వాతంత్య్ర సమరయోధులు సమరోద్యమంలో జైలు జీవితం అనుభవించినా ఉత్తరం అనేక విషయాలను కుటుంబాలకు చేరవేస్తూ వచ్చింది.



మహాత్మా గాంధీజీ ఉత్తరాల మీద ఒక పుస్తకాన్ని రచించారు. ఎందరో స్వాతంత్య్ర సమరయోధులు జైలు జీవితం అనుభవించినప్పుడు వారికి ఉత్తరాలే స్నేహితులుగా మారాయని ఆయన అందులో అభిప్రాయపడ్డారు.





1913 నుంచి1918 మధ్య కందుకూరి వీరేశలింగం గారికి రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన లేఖలు

దేశంలో తపాలా శాఖ...

భారత తపాలా శాఖను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం 1854 అక్టోబర్ 1న ఏర్పాటు చేసింది. 1776లో లార్డ్ లైవ్ తపాలా వ్యవస్థను ప్రారంభించగా, 1774లో వారన్ హేస్టింగ్స్ కలకత్తా కార్యాలయాన్ని ప్రారంభించారు. 1786లో మద్రాస్ జనరల్ పోస్ట్ ఆఫీసును, 1793లో బొంబాయి జనరల్ పోస్ట్ ఆఫీసులను ఏర్పాటు చేశారు. స్వాతంత్రం వచ్చే నాటికి దేశంలో 234 తపాలా కార్యాలయాలు ఉండేవి. అందులో 1,984 గ్రామీణ ప్రాంతాల్లో, 4,160 పట్టణ ప్రాంతాల్లోనూ ఉండేవి. ఈనాడు ప్రపంచంలోనే అతిపెద్ద తపాలా వ్యవస్థ ఉన్న దేశం భారత్. ప్రస్తుతం దేశంలో సుమారు 1.85 లక్షలకు పైగా కార్యాలయాలు ఉన్నాయి. దేశంలో ప్రతి 21.16 చదరపు కిలోమీటర్లకు ఒక పోస్ట్ ఆఫీస్ ఉంది. భారత దేశంలో రైల్వే శాఖ తరువాత రెండో అతిపెద్ద వ్యవస్థ పోస్టల్ శాఖ. సెల్ ఫోన్ వచ్చిన తరువాత ఉత్తరాలు రాసే వారు తగ్గినా, కాలానికి తగ్గట్టుగా మార్పులు చేసుకుంటూ సరి కొత్త సాంకేతికతతో మనకు మరింత దగ్గరై తన సేవలు ఎప్పటికప్పుడు కొత్తగా అందిస్తూ తన వ్యవస్థను మెరుగుపరచి విస్తరించుకుంటోంది. మొదట ఉత్తరాల వరకే సేవలు కొనసాగినప్పటికీ, ఇప్పుడు పాస్‌పోర్ట్, సేవింగ్స్ బ్యాంక్, ఇన్స్యూరెన్స్ లాంటి అనేక సేవలు కొత్తగా ప్రారంభించింది. 1874లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా అక్టోబర్ 9న ప్రపంచ తపాలా దినోత్సవాన్ని జరుపుకొంటారు. 1876 నుంచి భారతదేశం యూనివర్సల్ పోస్టల్ యూనియన్‌లో సభ్య దేశమైంది. ప్రపంచ తపాలా దినోత్సవం ప్రధాన ఉద్దేశం ప్రజల జీవితాల్లో, వ్యాపారాల్లో సామాజిక, ఆర్థిక అభివృద్ధి మొదలైన సహకారం గురించి ప్రజల్ని చైతన్యవంతం చేయడమే. అందుకే ఏటా అక్టోబర్ 9న ప్రపంచ, పదో తేదీన జాతీయ తపాలా దినోత్సవం నిర్వహించుకుంటున్నాం.

చిన్నప్పుడు అందరికీ ఉత్తరాలు రాసేవాడిని..



మార్టేరు వద్ద వనంపల్లి అనే పల్లెటూరులో నా బాల్యం గడిచింది. 1970వ దశకంలో అక్కడ చదువుకున్న వారి సంఖ్య చాలా తక్కువ. మా ఇంటిలో మా అమ్మ, నాన్న, చదువుకుని ఉండటం వల్ల అనేక మంది మా ఇంటికి వచ్చి ఉత్తరాలు రాయించుకోవడం, చదవించుకోవడం చేసేవారు. నాతో ఉత్తరం రాయించి తప్పొప్పులను మా అమ్మ సరిదిద్దేవారు. నేటి ఆధునిక పోకడలతో ఉత్తరం ఇంచుమించుగా కనుమరుగైపోయింది. కానీ ఉత్తరం అనే విధానం మాత్రం ఎక్కడా చెక్కుచెదరలేదు. అయితే సామాన్య జీవితాల నుంచి ఉత్తరం ఎటో వెళ్లిపోయింది.

– **మాదిరాజు శ్రీనివాస్**, ఆంధ్ర కేసరి యువజన సమితి, ప్రధాన కార్యదర్శి

చలం ప్రేమలేఖలలో..



ఈ ఉదయం పుష్పాలనీ పూచాయి. చల్లగాలి నన్ను తాకుతోంది. నక్షత్రాలతో ఆకాశం వణుకుతోంది. కానీ విచారం నిండిన కళ్లతో నేనొక్కణ్ణి కూచున్నానిల్లా అని ప్రేమ లేఖల్లో చలం అంటారు. ప్రేమానుభూతిని అస్వాదించిన వ్యక్తి కావడం వల్లే ఇంత గొప్ప లేఖలు రాశారేమో. నా చిన్నతనంలో ఉత్తరానికి చాలా ప్రాముఖ్యత ఉండేది. ఉత్తరం కోసం ఎదురుచూసిన మధుర జ్ఞాపకాలు ఇంకా మదిలో మెదులుతానే ఉన్నాయి.

– **డీవీకేఎస్ లక్ష్మి**, ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం

కందుకూరి లేఖలను సేకరించా..



ఉత్తరం అంటేనే ఆత్మావిష్కరణ. అనుబంధాలు పెరగాలన్నా, ఆప్తుల యోగక్షేమాలు తెలుసుకోవాలన్నా, మనసులో భావాలు వ్యక్తం చేయాలన్నా, వ్యక్తుల మధ్య ఏర్పడ్డ అపార్థాలు అడ్డుగోడలు కూలత్రోయాలన్నా, ఉత్తరానికి మించిన సాధనం మరొకటి లేదు. కందుకూరి వీరేశలింగం ఉత్తరాలన్నీ వివిధ చోట్ల పరిశోధకులు, అభిమానుల దగ్గర సేకరించాను. ఇప్పటివరకు అమూల్యమైన లేఖలు భద్రపరచాను.

– **డాక్టర్ పీవీబీ సంజీవరావు**, కందుకూరి సాహిత్య పరిశోధకుడు

అమ్మ సన్నిధిలో అంతరాలు!

- కోటసత్తెమ్మ తల్లి దర్శనానికి ప్రొటోకాల్ రగడ
- ఎంపీపీ, జెడ్పీటీసీలను కాదని కూటమి నేతలకు మర్యాదలు
- చివరి నిమిషంలో మంత్రి దుర్గేష్ పర్యటన రద్దు
- మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లికి ఆలయ మర్యాదలతో స్వాగతం



వివాదాలకు దారితీసిన బోర్డు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ తల్లి భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్నారు. ఈ ఆలయ చరిత్ర ఎంతో ఘనమైనది. ఏటా ఇక్కడ దేవీ నవరాత్ర మహోత్సవాలతో పాటు డిసెంబర్‌లో అమ్మవారి 'తిరునాళ' మహోత్సవాలు నిర్వహిస్తారు. కొద్ది నెలలుగా అమ్మవారి ఆలయం చుట్టూ ప్రొటోకాల్ వివాదాలు ముదురుతుండగా తాజాగా దేవీనవరాత్రి ఉత్సవాలతో అవి తారాస్థాయికి చేరాయి. కూటమి నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ఆలయ అధికారులు నిబంధనలు ఉల్లంఘిస్తూ వారికి అమ్మవారి దర్శనాలను దగ్గరుండి చేయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియామకం జరగకుండానే టీడీపీ, జనసేన నాయకులు తామే పాలకవర్గ సభ్యులమని హడావుడి చేస్తున్నారు.

ఎంపీపీ, జెడ్పీటీసీలకు అందని ఆహ్వానం..

నిబంధనల మేరకు నిడదవోలు మండల ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు (సూరిబాబు)లకు అమ్మవారి ఆలయం నుంచి దర్శనానికి ఆహ్వానం అందించాల్సి వుంది. కానీ ఆలయ అధికారులు ఆమెను పిలవకపోవడంపై భాగ్యలక్ష్మి ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే శేషారావుకు ఘనస్వాగతం

కాగా దేవీనవరాత్రుల్లో ఏడో రోజు బుధవారం అమ్మవారి దర్శనానికి మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు వస్తారని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అయితే ఉదయమే ఆలయానికి చేరుకున్న శేషారావుకు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికినట్లు వాట్సాప్ గ్రూప్‌ల్లో ఫోటోలు హల్‌చల్ చేయడంతో మంత్రి కందుల దుర్గేష్ గోపవరంలోని శ్రీగుబ్బాలమ్మను దర్శించుకుని వెనుదిరిగినట్లు తెలుస్తోంది. అలాగే అమ్మవారి దర్శనానికి విజయదశమి రోజు వస్తానని దుర్గేష్ తన అనుచరులకు సమాచారం ఇచ్చారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకంలో కూడా మంత్రి దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే శేషారావుల మధ్య కూటమి నాయకులు చిచ్చుపెట్టినట్లు విమర్శలున్నాయి.

ఇష్టారాజ్యంగా ఆలయ సిబ్బంది..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. నాలుగు రోజులు క్రితం ఆలయ ప్రాంగణంలో ఉచిత అన్నదానికి స్థానికులు, సమీపంలోని షాపుల వారు, వ్యాపారస్తులు రాకూడదని బోర్డు ఏర్పాటుచేయడంపై విమర్శలు వెల్లువెత్తడంతో ఆ బోర్డును తొలగించారు. అంతేగాక అమ్మవారి దర్శనానికి నేరుగా రాలేని కొంతమంది భక్తులు తమ పేర్లపై ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయాలని పంపిన టిక్కెట్ రుసుం డబ్బులు కూడా అమ్మవారి హుండీకి చేరకుండా కొందరు ఆలయ సిబ్బంది తమ ఫోన్‌పేలకు వేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి.



నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ తల్లి ఆలయం

చర్యలు తీసుకుంటాను

దేవీ నవరాత్రుల సందర్భంగా ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావులను ఆహ్వానించాలని కార్యాలయ సిబ్బందికి చెప్పాను. దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ 'సాక్షి'కి తెలిపారు.

పద్మభూషణ్ పాణింగిపల్లి ఇక్కడి వారే



డాక్టర్ పాణింగిపల్లి వేణుగోపాల్

రాజమహేంద్రవరం రూరల్: న్యూఢిల్లీలో మంగళవారం కన్నుమూసిన పద్మభూషణ్ అవార్డు గ్రహీత, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (ఎయిమ్స్) మాజీ డైరెక్టర్ డాక్టర్ పాణింగిపల్లి వేణుగోపాల్ (82) రాజమహేంద్రవరం వాసే.

భారతదేశపు మొట్టమొదటి గుండె మార్పిడిని నిర్వహించి కార్డియాక్ సర్జరీకి మార్గదర్శకుడిగా నిలిచిన ఆయన రాజమహేంద్రవరంలో జన్మించారు. ఎంబీబీఎస్‌లో మొదటి గోల్డ్‌మెడల్‌ను దేశ మొట్టమొదటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్ చేతులమీదుగాను, ఎంఎస్‌లో మొదటి గోల్డ్‌మెడల్ దేశ మొదటి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ చేతుల మీదుగా అందుకున్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్‌లో కార్డియోథెరసిక్ డిపార్టుమెంట్‌ను స్టార్ట్ చేశారు. ఎయిమ్స్ డైరెక్టర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. 1994లో కొద్దిరోజుల్లో చనిపోతాడన్న దేవీరామ్ అనే వ్యక్తికి బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి హార్ట్‌ను తీసి దేశంలోనే మొట్టమొదటిసారిగా హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన శిష్యులు ఉన్నప్పటికీ ఆయన మాత్రం దేశం వదిలి వెళ్లకుండా బెంగళూరులోనే స్థిరపడ్డారు. వైద్య రంగానికి చేసిన సేవలకుగాను డాక్టర్ వేణుగోపాల్‌ను 1998లో పద్మభూషణ్‌తో పాటు, డాక్టర్ బీసీ రాయ్ అవార్డు, ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లైఫ్ టైమ్ అవార్డుతో పాటు అనేక అవార్డులు వరించాయి. పుట్టపర్తిలో శ్రీసత్యసాయిట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హార్ట్ హాస్పిటల్ నిర్మాణం అంతా సత్యసాయిబాబా ఆదేశాల మేరకు డాక్టర్ వేణుగోపాల్ సమకూర్చిన టెక్నాలజీ, సలహాలతో చేపట్టారు. పార్లమెంటులో నలుగురు డాక్టర్లు సత్కారం పొందగా అందులో తెలుగువాడైన డాక్టర్ వేణుగోపాల్ ఒకరు. అవివాహితుడిగా ఉందామనుకున్న వేణుగోపాల్ సత్యసాయిబాబా ప్రోద్బలంతో 60 ఏళ్ల తరువాత ప్రియాసర్కార్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె ఉన్నారు. 2003లో రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో డాక్టర్ వేణుగోపాల్‌కు పౌరసన్మానం నిర్వహించారు. ఆనం కళాకేంద్రంలో గంధం నాగసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 108 సంఘాల నేతృత్వంలో పురప్రజలు ఘనంగా సత్కరించారు. 2023లో, ఆయన తన భార్య ప్రియా సర్కార్‌తో కలిసి రాసిన 'హార్ట్‌ఫెల్ట్' అనే జ్ఞాపకాలను ప్రచురించారు. వ్యక్తిగత, వృత్తిపరమైన చిత్తశుద్ధితో రాజీపడని వ్యక్తిగా కూడా ఆయన పేరు పొందారు. డాక్టర్ వేణుగోపాల్ మానవతావాదిగా, పరోపకారిగా గుర్తుండిపోతారు. వందలాది మంది నిరుపేదలకు ఉచిత వైద్య సలహాలు, ఉచిత శస్త్రచికిత్సలు అందించారు. రాజమహేంద్రవరంలో రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద డాక్టర్ వేణుగోపాల్ పెంకుటిల్లు ఉంది. గాంధీపురం-2లోను ఒక భవనం ఆయనకు ఉంది.

వీణావాణీ నమోస్తుతే



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు. మూలా నక్షత్ర ఘడియల్లో తల్లితండ్రులు తమ చిన్నారులకు అక్షరభ్యాసం చేయించి అమ్మ దీవెనలు పొందారు. రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో అమ్మవారిని సరస్వతీ మాతగా అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు తమ పిల్లలతో పూజలు చేయించి అక్షరాభ్యాసం చేయించారు.

జననేత జక్కంపూడి చిరస్మరణీయుడు

- నేటి తరం నాయకులకు ఆయన స్ఫూర్తి
- రామ్మోహనరావుకు నేతల ఘన నివాళులు



జక్కంపూడి విగ్రహానికి నివాళులు అర్పించిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, షర్మిలారెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర మాజీ మంత్రి, దివంగత జననేత జక్కంపూడి రామ్మోహనరావు ఆశయ సాధనకు తమ కుటుంబం కృషి చేస్తుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. బుధవారం రాజమహేంద్రవరం కంబాలచెరువు సెంటర్‌లో కోడి కోట ఆధ్వర్యంలో రామ్మోహనరావు 13వ వర్ధంతిని పుష్కరించుకుని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రౌతు సూర్యప్రకాశరావు, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరు శ్రీనివాస్, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షర్మిలారెడ్డి పాల్గొని జక్కంపూడి విగ్రహానికి నివాళులర్పించారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ తన తండ్రి రాజకీయ ప్రస్థానం దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డితోనే కొనసాగిందన్నారు. తన తండ్రి రామ్మోహనరావు సామాన్య కార్యకర్తగా రాజకీయాలలో తన ప్రస్థానాన్ని ప్రారంభించి, రాష్ట్ర క్యాబినెట్ మంత్రిగా ఎదిగారన్నారు. మహానేత హయంలో రాష్ట్రంలో ఏ చిన్న ఉద్యమానికి, పోరాటానికి పిలుపునిచ్చినా ఆ కార్యక్రమాన్ని తన భుజస్కందాల మీద వేసుకుని జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించేవారన్నారు. నాన్నను స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లోకి వచ్చి తమ కుటుంబ సభ్యులంతా ఆయన చూపిన బాటలోనే నడుస్తున్నామన్నారు. ఏటా ఆయన జయంతి, వర్ధంతి రోజున వివిధ సేవా కార్యక్రమాలను శ్రీ జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ జక్కంపూడి నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసిన చిరస్మరణీయుల అన్నారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ సమష్టి ప్రజా ఉద్యమాల ద్వారా సమాజ అభివృద్ధికి పాటుపడిన జక్కంపూడి ఆశయాలు ఆచరణీయమని గుర్తు చేశారు. కార్యక్రమంలో నందెపు శ్రీనివాస్, బొంతా శ్రీహరి, అడపా అనిల్, సాలా సావిత్రి, మాసా రామజోగ్, మానే దొరబాబు, సోము, లాయర్ ధర్మ, కాస్పే రాజేష్ సురేష్, కేఎల్ నరసింహారెడ్డి, వైకేఎల్ పేపర్ మిల్ సాయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భగవంతుడు సర్వాంతర్యామి



మాట్లాడుతున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: భగవంతుడు సర్వాంతర్యామి అని పరిపూర్ణానంద స్వామి అన్నారు. కాకినాడ శ్రీ పీఠంలో జరుగుతున్న మహాశక్తి యాగంలో భాగంగా బుధవారం సుమారు 30 వేల మంది విద్యార్థులతో త్రికోటి సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. సరస్వతీమాత ఫొటో, పూజా సామగ్రిని నిర్వాహకులు అందజేయగా విద్యార్థులు ఈ పూజలో పాల్గొన్నారు. కాకినాడ జిల్లాతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరు కావడంతో శ్రీపీఠం ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. చిన్నారులు సరస్వతీ పూజలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రముఖ తెలుగు కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ వేదవిద్య కూడా సరస్వతీ స్వరూపమే అన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

అక్షరాభ్యాసాలు

శ్రీ పీఠంలోని ఐశ్వర్యాంబిక ఆలయ ప్రాంగణంలో బుధవారం అక్షరాభ్యాసాలు ఘనంగా జరిగాయి. సుమారు 200 మంది చిన్నారులతో వారి తల్లిదండ్రులు అక్షరాలను దిద్దించారు.

15న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

రామచంద్రపురం రూరల్: అరుణాచలం గిరి ప్రదక్షిణ, స్వామివారి దర్శనం చేసుకునే భక్తుల కోసం ఈ నెల 15వ తేదీన రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ, పుష్ బ్యాక్ వీడియో కోచ్ బస్సులు బయలుదేరుతున్నాయి. ఈ విషయాన్ని డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. బస్సులు రామచంద్రపురం నుంచి బయలుదేరి విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీనివాస మంగాపురం (తిరుపతి), కాణిపాకం, అర్ధగిరి ఆంజనేయస్వామి, శ్రీపురం (మహాలక్ష్మి అమ్మవారి బంగారు గుడి) మీదుగా 17వ తేదీకి అరుణాచలం చేరుకుంటాయన్నారు. పౌర్ణమి రోజు అరుణాచలగిరి ప్రదక్షిణ, దర్శనాల అనంతరం కంచి, తిరుత్తణి క్షేత్రాల మీదుగా 18న రామచంద్రపురం తిరిగివస్తాయన్నారు. టిక్కెట్లను బుక్ చేసుకునేందుకు 73829 12064, 99489 39888, 73829 12146, 94939 53838, 73829 10769, 73829 15520 నంబర్లను సంప్రదించాలన్నారు. టిక్కెట్ ధర రూ.3,200గా నిర్ణయించామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎండాకు వణుకు

- విజృంభిస్తున్న ఎండాకు తెగులు
- వరిపంటపై దాడి
- ఆందోళనలో రైతులు



ఎండాకు తెగులు ఆశించిన వరిచేను



క్రిమి సంహారక మందును పిచికారీ చేస్తున్న రైతులు

ఆలమూరు: ఖరీఫ్ సాగు చేతి కొచ్చే తరుణంలో ఎండాకు తెగులు వెంటాడుతోంది. ఇప్పటి వరకూ ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇక పంట దక్కుతుందని భావిస్తున్న సమయంలో ఎండాకు తెగులు అష్టకష్టాలు పెడుతోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంతో ఈ తెగులు వ్యాప్తి చెందింది. దీంతో రైతులకు కంటి మీద కునుకు ఉండడం లేదు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 1.58 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగింది. భారీ వర్షాలు కురిసిన కొన్ని ప్రాంతాల్లో గడచిన నెల రోజుల నుంచి ఎండాకు తెగులు తీవ్రంగా ఉంది.

అన్నదాతల ఆందోళన

జిల్లాలోని పలు మండలాల్లో ముందుగా సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కంకి గట్టి పడే దశలో ఉంది. ఆలస్యంగా వరినాట్లు వేసిన చోట్ల మాత్రం కంకి వేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ తెగులు సోకడం వల్ల అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి సాయం అందించలేదు. రైతులు అప్పులు చేసి మరీ సాగును చేపట్టారు. పంట తుది దశలో హఠాత్తుగా ఎండాకు తెగులు సంభవించడంతో అన్నదాతలకు ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీన్ని సరైన సమయంలో గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపడితే నివారణ సాధ్యమేననే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ తెగులు సోకిన చేలల్లో కొందరు రైతులు కాండం కుళ్లు లేదా దుబ్బు కుళ్లు తెగులుగా పొరబడి శిలీంధ్ర నాశినిలను పిచికారీ చేస్తున్నారని వ్యవసాయశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల మరింత పంట నష్టం జరిగే అవకాశం ఉందన్నారు.



ఎండాకు తెగులు సోకిన వరి దుబ్బు

నిర్ధారణ తప్పనిసరి

వరిపైరుకు ఉన్న లక్షణాలను బట్టి ఎండాకు తెగులు సోకినట్లుగా గుర్తిస్తే ఆ మేరకు వ్యవసాయశాఖ సూచనలు, సలహాలను తీసుకోవాలి. వారి సలహాల మేరకు నష్టనివారణ చర్యలు తీసుకోవాలి. ఎండాకు తెగులును త్వరితగతిన నిర్ధారించి నష్ట నివారణ చర్యలు తీసుకుంటే సకాలంలో నివారించవచ్చు. వరిపైరుపై ఎండాకు తెగులు మూడు దశల్లో సోకుతుంది. జాంథో మోనాస్ ఓరైజ్ లేదా పాథోవార్ ఓరైజ్ అనే బ్యాక్టీరియా వల్ల ఇది ఆశిస్తుంది. నారుమడి దశలో ఆకుల అంచుల నుంచి దాగు మచ్చలుగా ఏర్పడుతుంది. ఒక్కొక్క ప్రాంతంలో భూసారాన్ని బట్టి నారుమళ్లు వేసిన నెల రోజుల తరువాత కూడా సోకవచ్చు. తెగులు ఉధృతిగా ఉన్నప్పుడు దుబ్బులోని కొన్ని పిలకలు చనిపోతుంటాయి. ఎండిన ఆకులను ముక్కలుగా కత్తిరించి మంచినీటిలో ఉన్న గ్లాసులో వేసి అరగంట తరువాత నీటిని గమనిస్తే తెగులు సోకిన భాగాల నుంచి తెగులుకు సంబంధించి బ్యాక్టీరియా నీటిలో కలిసిపోయి పసుపురంగులోకి మారిపోతే ఎండాకు తెగులుగా గుర్తించాలి.

వాతావరణంలో మార్పులు

వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల ఎండాకు తెగులు దశను మార్చుకుంటుంది. వరి పిలకలు వేసే దశలో కానీ, కంకి గట్టి పడే దశలో కానీ ఈదురు గాలులలో కూడిన వర్షాలు కురిస్తే ఈ వ్యాధి సోకుతుంది. 32 డిగ్రీల ఉష్ణోగ్రత కంటే తక్కువగా ఉన్న వాతావరణంలో మొక్కల సాంద్రత ఎక్కువగా పొలాల్లో సోకుతుంది. వరి సాగులో అధిక నత్రజని వాడితే ఈ ఎండాకు తెగులు సోకి పంటను తీవ్రంగా నష్టపర్చే అవకాశం ఉంటుంది. తెగులు ఉధృతిగా ఉన్న సమయంలో వరిదుబ్బులపై మచ్చలు తీవ్రత పెరిగి ఆకులన్నీ ఎండిపోయే అవకాశం ఉంటుంది. తెగులు సోకిన పొలాల్లో ఆకు ఉదయం పూట పసుపురంగులో ఉంటుంది. ఆకుపై జిగురు వంటి పదార్థం బిందువులుగా బయటకు ఉబికి వస్తుంది. ఎండ తీవ్రత పెరిగే కొద్ది క్రమేపీ బిందువులు ఎండిపోయి నీటిలో పడిపోవడం వల్ల మళ్లీ ఆకులు యథాస్థితికి చేరుకుంటాయి. సాగునీటి ద్వారా ఒక పొలం నుంచి మరో పొలానికి వ్యాప్తి చెందుతుంది.

అవగాహనతోనే నివారణ సాధ్యం

వ్యవసాయశాఖ సూచనలు, సలహాలతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఎండాకు తెగులును సకాలంలో నిర్మూలించడం సాధ్యమేనని జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు చెబుతున్నారు. ఆయన చేసిన సూచనల ప్రకారం..

- వ్యవసాయశాఖ నిర్దేశించిన మోతాదులో మాత్రమే నత్రజనిని వినియోగించాలి.
- వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవిస్తే నత్రజని ఎరువుల వాడకాన్ని సత్వరమే నిలిపివేసి, మళ్లీ ఎండ కాసిన తరువాత పునఃప్రారంభించాలి.
- వ్యవసాయశాఖ సిఫారసు చేసిన పొటాష్‌ను మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే సమయంలో ఉపయోగించాలి.
- పొలం గట్ల వెంబడి అక్కడక్కడ ఉండే కలుపు మొక్కలను తొలగిస్తే తెగులు సోకే బ్యాక్టీరియా వ్యాప్తి చెందే అవకాశం ఉండదు.
- పొలం చుట్టూ చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎండాకు తెగులు సోకిందని భావిస్తే పొలంలో అప్పటి వరకూ ఉన్న సాగునీటిని రెండు లేదా మూడుసార్లు బయటకు పంపించి వేసి మళ్లీ కొత్తగా నీరును నింపుకోవాలి.
- ఎకరాకు 20 కేజీల పొటాష్‌ను వరిపైరు పూర్తిగా అందే వరకూ పైపాటుగా ఉపయోగించాలి.
- కాపర్ హైడ్రాక్సైడ్ మందును రెండు గ్రాములు లేదా కాపర్ సల్ఫేట్ రెండు మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ విధంగా పది రోజుల వ్యవధిలో రెండుసార్లు చేస్తే ఎండాకు తెగులు నుంచి పూర్తిగా బయటపడవచ్చు.

కాకినాడలో కూటమి నాయకుల కొట్లాట

కాకినాడ: కూటమి ప్రభుత్వంలోని ఇద్దరు నాయకుల మధ్య జరిగిన కొట్లాట పోలీసుస్టేషన్ వరకూ వెళ్లింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ గాంధీనగర్‌లోని కొయ్యలవారివీధి ప్రాంతానికి చెందిన స్థానికులు పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదంటూ ప్రజారోగ్య విభాగానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఎంహెచ్‌వో ఆదేశాల మేరకు ఆ ప్రాంతానికి చెందిన శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుధ్య సిబ్బంది, స్థానికంగా ఉన్న టీడీపీ నాయకులతో కలిసి వెళ్లారు. అయితే స్థానికులు, అక్కడకు వెళ్లిన సిబ్బంది, ఇతర టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేసిన సిబ్బందిపై విరుచుకుపడ్డారనే సమాచారం.దీంతో సమస్యను పరిష్కరించకుండా ప్రజలను బెదిరించడం ఏమిటంటూ మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి భర్త, బీజేపీ నాయకుడు గోడి వెంకట్ ప్రజలకు మద్దతుగా వెళ్లారు. అతడిపై టీడీపీ నాయకుడు జొన్నాడ వెంకట రమణ దాడికి యత్నించారు. ఈక్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి., ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానికులు సర్దిచెప్పడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి వెళ్లిపోయాయి. అనంతరం గోడి వెంకట్ తనపై దాడి చేశాడంటూ టీడీపీ నాయకుడు వెంకట రమణ పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఇరువర్గాలనూ రాజీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.



గోడి వెంకట్‌పై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

బాలికపై అత్యాచారం కేసులో నిందితుల అరెస్టు

పిఠాపురం: బాలికపై అత్యాచారం కేసులో నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం తన కార్యాలయంలో నిందితులను మీడియా ముందు హాజరుపరిచారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పిఠాపురం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 16 ఏళ్ల బాలికను ఈ నెల 7వ తేదీ సాయంత్రం ఆటో డ్రైవర్, అతడి స్నేహితురాలు కిడ్నాప్ చేశారు. ఆటోలో మాదాపురం గ్రామ శివారులోని డంపింగ్ యార్డు సమీపంలోని గోదావరి కాలువ గట్టు వద్దకు తీసుకువెళ్లారు. బాలికకు బలవంతంగా మద్యం పట్టించారు. అనంతరం ఆటో డ్రైవర్ అత్యాచారం చేశాడు. ఈ సంఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్లో నమోదైంది. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో కేసులో నిందితులను పట్టుకోవడానికి మూడు బృందాలను ఏర్పాటు చేసి గాలించారు. పిఠాపురం అయితే నగర్‌కు చెందిన దుర్గాలక్ష్మయ్య అలియాస్ జాన్, ఇందిరా నగర్‌కు కొంగుపూడి సుబ్బలక్ష్మిలను బుధవారం గొర్స రోడ్డులోని రైస్‌మిల్లు సమీపంలో అరెస్టు చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితుడి నుంచి ఆటో, దుస్తులు, మద్యం సీసాను స్వాధీనం చేసుకున్నారు.



నిందితులను విలేకరులకు చూపిస్తున్న పోలీసులు

టీడీపీ నాయకుడి ఇంట్లో తెలంగాణ మద్యం

6,144 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

తుని రూరల్: కాకినాడ జిల్లా తుని మండలం కేఓ మల్లవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సుర్ల గోవిందరాజులు ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన తెలంగాణ మద్యం సీసాలను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ చెన్నకేశవరావు, ఎస్సై బి.కృష్ణమాచారి తుని మండలం ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లో నివాసం ఉంటున్న సుర్ల గోవిందు ఇంట్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దీంతో రూ.2,45,760 విలువ చేసే 128 కేసుల (6,144 క్వార్టర్ బాటిళ్లు) తెలంగాణ మద్యాన్ని గుర్తించారు. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో గోవిందరాజులు భార్య ఎంపీటీసీ సభ్యురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొద్దిరోజులకే టీడీపీలో చేరారు. పిల్లలు చదువుల పేరుతో తుని మండలం ఎస్.అన్నవరం శివారు శేషాద్రినగర్‌లో నివాసం ఉంటున్న గోవిందరాజులు ఇంట్లో పెద్ద ఎత్తున మద్యం నిల్వలు లభించాయి. ఖమ్మం, వరంగల్ నుంచి తెలంగాణ మద్యం జిల్లాకు వచ్చిన సమాచారంతో సాధారణ తనిఖీలు నిర్వహించిన పోలీసులకు అక్రమ మద్యం నిల్వలు లభించాయి. ఇందుకు బాధ్యులైన గోవిందరాజులు, పసగడుగుల చీడిగిత్లిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై లోతుగా విచారణ చేస్తున్నామని, అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్టు సీఐ తెలిపారు. అక్రమార్కులు ఏ పార్టీ అయినా విడిచిపెట్టేది లేదని, మద్యం మాఫియాను ఉపేక్షించబోమని హెచ్చరించారు. తనిఖీల్లో మరిన్ని నిల్వలు బయటపడే అవకాశాలు ఉన్నాయని, అధికార పార్టీ నాయకులు మరింత మంది ఉన్నట్టు తెలుస్తోంది.



స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యాన్ని పరిశీలిస్తున్న సీఐ చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణమాచారి



మద్యం సీసాలు, నిందితుడితో ఎస్సై కృష్ణమాచారి, సిబ్బంది

మద్యం సీసాలతో ఇద్దరు టీడీపీ కార్యకర్తల అరెస్టు

తుని మండలం కేఓ మల్లవరంలో అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఇద్దరు టీడీపీ కార్యకర్తలను తుని రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ ఎస్సై బి.కృష్ణమాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రెండ్లు ప్రాంతాల్లో పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా గాలి గోవిందు వద్ద 94 బాటిళ్లు, గాలి కృష్ణ వద్ద 72 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

నేటి నుంచి బాస్కెట్ బాల్ పోటీలు

రామచంద్రపురం: కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నుంచి ఈ నెల 12వ తేదీ వరకూ 9వ సబ్ జూనియర్స్ అంతర జిల్లాల బాస్కెట్ బాల్ పోటీలు జరగనున్నాయి. మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జ్ఞాపకార్థం వీటిని నిర్వహిస్తున్నట్టు ఏపీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నమని చక్రవర్తి, రామచంద్రపురం బాస్కెట్ బాల్ అధ్యక్షుడు డాక్టర్ సి.స్టాలిన్ తెలిపారు. ఈ పోటీలను ఉదయం 9 గంటలకు రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రారంభిస్తారన్నారు. ఈ నెల 12న జరిగే ముగింపు సభలో ఎంపీ గంటి హరీష్ మాధుర్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ పాల్గొంటారన్నారు.

ఇంద్రకీలాద్రిపై గరగ నృత్యం

అంబాజీపేట: శరన్నవరాత్రుల సందర్భంగా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న కనకదుర్గమ్మ ఉత్సవాలలో ముక్కామలకు చెందిన గరగ నృత్య కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. ఈ నెల 6, 7, 8 తేదీలలో జరిగిన వాహన సేవలో వీరందరూ పాల్గొన్నారు. ఆలయ ఈవో నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలోని విజయదుర్గ నాట్యబృందం (కళాకారులు) విజయవాడకు తరలివెళ్లింది.



కనకదుర్గమ్మ ఆలయం వద్ద ప్రదర్శన ఇస్తున్న గరగ నృత్య కళాకారులు (ఫైల్)

రెండు బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

మండపేట: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. గొల్లపుంత కాలనీకి వెళ్లే రోడ్డులో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. వేదరాజు సత్యనారాయణ రాజు ద్విచక్ర వాహనంపై మండపేట మార్కెట్‌కు వచ్చి తిరిగి గొల్లపుంత కాలనీలోని తన ఇంటికి బయలు దేరాడు. అదే సమయంలో కాలనీ నుంచి పెదప్రోలు వికాస్, మణి మోటారు సైకిల్‌పై వేగంగా వచ్చి సత్యనారాయణరాజును ఢీకొట్టారు. విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై హరికోటి శాస్త్రి హుటాహుటిన సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఢీ కొట్టిన యువకులిద్దరికీ స్వల్పంగా, సత్యనారాయణరాజుకు తీవ్ర గాయాలయ్యాయి.

లారీ ఢీకొని మహిళ మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్ చెరువు శివారు ఆటోనగర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. రాజమహేంద్రవరానికి చెందిన పెనుగుల బేబీ ప్రశాంతి (50) లీగల్ పారా వలంటీర్‌గా పనిచేస్తోంది. రాజానగరం నుంచి స్కూటీపై రాజమహేంద్రవరం వెళుతుండగా జీఎస్ఎల్ వద్ద ఆ ఆస్పత్రిలో విధులు ముగించుకున్న రాజమహేంద్రవరం ఆనంద నగర్‌కి చెందిన ఆకుమర్తి సత్యవతి లిఫ్టు అడిగింది. దీంతో ఇద్దరూ ఆటోనగర్ ప్రాంతానికి వచ్చేసరికీ వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో స్కూటీ నడుపుతున్న బేబీ ప్రశాంతి అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న సత్యవతికి తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే ఆమెను జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బొమ్మూరు ఎస్సై ఎస్పీ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

చాగల్లు: దారవరం రైల్వేగేటు సమీపంలో రైలు కిందపడి వివాహిత ఆత్మహత్య చేసుకుంది. నిడదవోలు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన కొండేపాటి కుమారి (41)కి కుటుంబ సభ్యులతో మనస్పర్థలు వచ్చాయి. దీంతో మనస్తాపం చెందిన ఆమె బుధవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చి దారవరం రైల్వేగేటు సమీపంలో రాజమహేంద్రవరం వైపు వెళ్లే రైలు కిందపడి మృతి చెందింది. ఈ ఘటనపై రైల్వే జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ పోటీలలో సత్తా చాటాలి

రాజానగరం: అంతర్ జిల్లాల స్థాయిలో క్రీడా పోటీలలో పాల్గొన్న వారందరూ మరింత ప్రతిభను కనబరచి, జాతీయ స్థాయిలో సత్తా చాటాలని డిప్యూటీ డీఈఓ ఈవీఈఎస్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ అన్నారు. దివాన్ చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఏపీ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. బాలుర అండర్ 17 కేటగిరీలో హోరాహోరీగా జరిగిన ఈ పోటీలలో విజేతలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో చిత్తూరు, ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం, తృతీయ స్థానంలో తూర్పుగోదావరి జట్లు నిలిచాయి. ఈ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఈ మేరకు ఎంపికైన 16 మంది క్రీడాకారుల వివరాలు వెల్లడించారు. వారిలో కాకూరి తేజసాయిరెడ్డి, తంగరాజు, మిడపాల యోగేశ్వర్ (చిత్తూరు), రాజనాల వెందత్తసాయి, చిన్ని ధిల్లేశ్వరరావు (శ్రీకాకుళం), కొల్లాబత్తుల షెల్విక్, అంగారపు వెంకట్ గణేష్ (తూర్పు గోదావరి), ఆకుల దేవ్ సూర్యసాయి (విశాఖపట్నం), పిల్లా దేవి చరితసత్య (ప్రకాశం), పిడిది జశ్వంత్ (విజయనగరం), ముడే ప్రసాద్ నాయక్ (కర్నూల్), దాసరి జాషువా (నెల్లూరు), వనం గౌరీశంకర్ (విశాఖపట్నం), మోపిదేవి తాన్విత (కృష్ణ), అద్దంకి రాజ్‌పాల్ (గుంటూరు), కత్తిక చైతన్యకుమార్ (తూర్పు గోదావరి) ఉన్నారు. కార్యక్రమంలో శ్రీప్రకాష్ విద్యానికేతన్ కరస్పాండెంట్ విజయ్‌ప్రకాష్, పరిశీలకులు ఎంవీ నాగేంద్ర, ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ ఎఎస్ఎన్ మూర్తి, ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి ఎస్.నాగరాజు, వీరబాబు, గంగాధర్ పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన చిత్తూరు జట్టు

ఆలయానికి రూ.30 లక్షల భూమి దానం



భూమిదాన పట్టా నమూనాను అందజేస్తున్న రెడ్డి ఆదిమూర్తి దంపతులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడలోని బాలా త్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి నగరానికి చెందిన రెడ్డి ఆదిమూర్తి, అనురాధ దంపతులు 50 సెంట్ల భూమిని బుధవారం దానం చేశారు. ఈ భూమి దానపట్టాను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సమక్షంలో అందజేశారు. జగ్గంపేట మండలం కాండ్రేగుల గ్రామంలో ఉన్న ఆ భూమి విలువ రూ.30 లక్షలు ఉంటుంది. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఈఓ వీర్రాజు చౌదరి అమ్మవారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి పాల్గొన్నారు.

రేఖ... నేటితో 70 నిండి
71లోకి అడుగుపెడుతోంది.
కాని మొన్న ఐఫా వేడుకలో
వేదిక మీద ఆమె చేసిన
15 నిమిషాల నృత్యం చూస్తే
వయసు 17 దగ్గరే ఆగిపోయిందని
అనిపించింది.
రేఖ -
ఎన్నో ఆటుపోట్లు
జీవితపు ఎదురుదెబ్బలు ఎదుర్కొంది.
కాని ముందుకు సాగడం
సౌందర్య భరితంగా జీవించడమే
జీవిత పరమార్థం అని నిరూపిస్తూనే ఉంది.
కొంచెం కలత చెందితే విరక్తి అవతారం దాల్చే
నేటి యువత రేఖ నుంచి ఎంత నేర్చుకోవాలి?



ఏజ్... సెవెంటీన్



లైఫ్... సెవెంటీ ఎంఎం స్క్రీన్

పన్నీరద్దుకున్న పసిడి రేఖ

1993.

ఫిల్మ్‌ఫేర్ మేగజైన్ వారు చెన్నైలో జెమినీ గణేశన్‌కు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు బహూకరిస్తున్నారు. వేడుకలో దక్షిణాది దిగ్గజాలంతా ఉన్నారు. ప్రతిష్ఠాత్మకమైన సందర్భం. జెమినీ గణేషన్ స్టేజ్ మీదకు వచ్చారు. మైక్‌లో వినిపించింది– ఇప్పుడు జెమినీ గణేశన్‌కు అవార్డు బహూకరించవలసిందిగా రేఖను ఆహ్వానిస్తున్నాము...

చప్పట్లు మిన్నంటాయి. రేఖ స్టేజ్ మీదకు వచ్చింది. జెమిని గణేశన్‌కు అవార్డు ఇచ్చింది. జెమిని మైక్ అందుకుని 'నా కూతురు రేఖ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం నాకు చాలా సంతోషంగా ఉంది'...

రేఖ ఊహ తెలిసినప్పటి నుంచి ఈ మాట కోసం ఎదురు చూస్తోంది. 'రేఖ నా కూతురు' అని జెమిని అనాలని ఎదురు చూసిన మాట. ఇంతకాలానికి విన్నమాట. రేఖ సంతోషంతో వెక్కివెక్కి ఏడ్చింది.

•••

స్త్రీకి మగవాడి తోడు ఉండాలని భారతీయ సంప్రదాయం అంటుంది. అలా తోడు ఉండక తప్పని పరిస్థితులు మన దేశంలో ఉంటాయి. రేఖకు బాల్యం నుంచి కూడా తండ్రి తోడు లేదు. తల్లి పుష్పవల్లి, తండ్రి జెమిని గణేశన్ వివాహ బంధంలో లేకుండానే రేఖను కన్నారు. రేఖ తన బాల్యంలో 'అక్రమ సంతానం' గా నింద అనుభవించింది. పుష్పవల్లిని భార్యగా, రేఖను కుమార్తెగా స్వీకరించడానికి జెమిని సిద్ధంగా లేడు. బతుకు గడవడానికి కుమార్తెను సినిమాల్లో ప్రవేశ పెట్టింది పుష్పవల్లి. కాని మద్రాసులో రేఖను హీరోయిన్‌గా చేయడానికి ఎవరూ సిద్ధంగా లేరు– జెమిని భయంతో. అదీగాక పుష్పవల్లికి నటిగా ఉన్న రోజుల్లో హిందీలో వెలగాలని ఆశ ఉండేది. ఆ ఆశను కనీసం కుమార్తె అయినా నెరవేర్చాలని కోరుకుంది. అప్పటికే ఆమెకు మద్రాసులో చాలా బాధలు ఉన్నాయి. అందుకని తన చెల్లెల్ని తోడు ఇచ్చి రేఖను బొంబాయి పంపింది. పద్నాలుగేళ్ల అమ్మాయి రేఖ. ఏమీ తెలియని రేఖ. బొంబాయిని చూసి బెంబేలెత్తిపోయిన రేఖ.

•••

1970లో నవీన్ నిశ్చల్ పక్కన హీరోయిన్‌గా నటించిన 'సావన్ భాదో' సినిమా విడుదలైంది. బొంబాయి పత్రికలన్నీ రేఖను తెర మీద చూసి ఫక్కున నవ్వాయి. నల్లగా, లావుగా ఉన్న రేఖను గేలి చేశాయి. 'అగ్లీ డక్‌లింగ్' అని పేరు పెట్టాయి. '33 ఇంచుల నడుము హీరోయిన్' అని ఎద్దేవా చేశాయి. రేఖకు ఇవన్నీ ఏమీ అర్థం కాలేదు– తాను సినిమాల్లో నటిస్తే ఇంటి దగ్గర కష్టాలు తీరుతాయి అన్న ఒక్క సంగతి తప్ప. పబ్లిసిటీ కోసం రేఖ చేత ఇంటర్వ్యూల్లో అవాకులు చవాకులు మాట్లాడించేవారు నిర్మాతలు. 'ముద్దు సీన్లు నటించే' అమ్మాయిగా రేఖకు పేరు పడింది. రేఖను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు.

•••

రేఖ బి–గ్రేడ్ సినిమాల్లో నటిస్తూ ఉంటే ఆ సమయానికి పరిచయమైన జితేంద్రలో ఆమె భవిష్యత్ భాగస్వామిని ఊహించుకుంది రేఖ. అయితే అతను రేఖతో స్నేహంగా ఉన్నా తన గర్ల్‌ఫ్రెండ్, ఎయిర్ హోస్టెస్ శోభనే వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. ఆ తర్వాత వినోద్ మెహ్రా ఆమెకు ఎంత దగ్గరయ్యాడంటే అతడిని పొందలేక రేఖ ఆత్మహత్యాయత్నం చేసిందన్న వార్తలు వచ్చాయి. తర్వాతి రోజుల్లో విలన్‌గా చేసిన కిరణ్ కుమార్ కూడా ఆమె బోయ్ ఫ్రెండ్‌గా ఉన్నాడు. ఈ దశలన్నీ దాటాక 1976లో 'దో అంజానే'లో అమితాబ్‌తో కలిసి నటించాక రేఖ జీవితం మారిపోయింది. జీవితాన్నీ, కెరీర్‌నీ సీరియస్‌గా తీసుకోవడం అమితాబ్ నుంచి రేఖ నేర్చుకుంది. ఆమె అమితాబ్‌ను పేరు పెట్టి ఎప్పుడూ పిలవదు. 'ఓ' (వారు/ఆయన) అంటుంది. పత్రికలు కూడా 'ఓ' అనే రాసేవి. అమితాబ్–రేఖల జోడి సూపర్ హిట్ అయ్యింది. ఆలాప్, ఖూన్ పసీనా, మొకద్దర్ కా సికిందర్, మిస్టర్ నట్వర్‌లాల్, రామ్ బలరామ్, సుహాగ్, సిల్‌సిలా. ఆమ్‌స్టర్ డామ్ డచ్ తులిప్ పూల మధ్య రేఖ, అమితాబ్‌ల మధ్య సాగే 'దేఖా ఏక్ ఖ్వాబ్ తో ఏ సిల్‌సిలే హుయే' పాట హిందీ సినిమాలకు సంబంధించి అత్యంత రొమాంటిక్ గీతంగా నేటికీ అభిమానులను సంపాదించుకుంటూనే ఉంది.



ఐఫా వేడుకలో రేఖ నృత్యం

రేఖ టాప్ 10 సాంగ్స్

1. తేరే బినా జియా జాయేనా – ఘర్
2. ఆజ్‌కల్ పావ్ జమీ పర్ – ఘర్
3. సున్ దీదీ సున్ తేరేలియే – ఖూబ్‌సూరత్
4. సలామే ఇష్క్ మేరీ జాన్ – ముకద్దర్ కా సికిందర్
5. దిల్ చీజ్ క్యా హై – ఉమ్రావ్ జాన్
6. ఛోటి సి కహానీ సే బారిషోంకే పానీ సే – ఇజాజత్
7. పర్దేశియా ఏ సచ్ హై పియా – మిస్టర్ నట్వర్‌లాల్
8. మన్ క్యూ బెహకా రే బెహకా – ఉత్సవ్
9. గుమ్ హై కిసీ కే ప్యార్ మే – రామ్‌పూర్ కా లక్ష్మణ్
10. ఏ కహా ఆగయే హమ్ – సిల్‌సిలా

•••

ప్రతికూలతలను రేఖ అనుకూలంగా మార్చుకుంటూ పోరాటం సాగిస్తూ వచ్చింది. ఒక నటికి దేహానికి మించిన పెట్టుబడి లేదని, దాని పోషణ ప్రథమమని గ్రహించిన మొదటి హీరోయిన్ రేఖ. ఇందుకు అమితాబ్ గైడెన్స్ ఉపయోగపడింది. బరువు తగ్గడం ఒక వ్రతంగా పెట్టుకున్న రేఖ నెలల తరబడి కేవలం యాలకులు కలిపిన పాలు తాగి బతికింది. బాలీవుడ్‌లో ఆమె వల్లే యోగా, ఏరోబిక్స్ పరిచయం అయ్యాయి. మేకప్ రహస్యాలు నటికి తెలిసి ఉండాలని లండన్ వెళ్లి మేకప్ కోర్సు చేసి వచ్చిందామె. ఇప్పుడు బాలీవుడ్‌లో ఎలా కనపడాలో, ఎలా ముందుకు సాగాలో, ఎలా ఇమేజ్‌ను పెంచుకుంటూ వెళ్లాలో ఆమెకు తెలుసు. అంతవరకూ సినిమా స్టిల్స్ మాత్రమే పత్రికలకు అందేవి. రేఖ ప్రత్యేకంగా ఫొటో షూట్స్ చేసి ఆ స్టిల్స్ పత్రికలకు ఇచ్చేది. ఇది బొత్తిగా కొత్త. అందువల్ల ఆమె ఎప్పుడూ కవర్ గర్ల్‌గా నిలిచేది. ఆ తర్వాత హీరో హీరోయిన్లు ఆ ట్రెండ్‌ను ఫాలో అవక తప్పలేదు.

•••

రేఖ కేవలం ఒక గ్లామర్ డాల్ కాదు ఆమె మంచి నటి అని చెప్పే సినిమా వచ్చింది. 'ఘర్'. గుల్జార్ దర్శకత్వంలో 1978లో వచ్చిన ఈ సినిమా రేఖలోని సమర్థమైన నటిని ప్రేక్షకులకు చూపింది. ఈ సినిమాలోని పాటలన్నీ పెద్ద హిట్. ఆ తర్వాత హృషికేశ్ ముఖర్జీ దర్శకత్వంలో వచ్చిన 'ఖూబ్‌సూరత్' (1980) రేఖను యూత్‌కు బాగా దగ్గర చేసింది. దాంతోపాటు ఫిల్మ్‌ఫేర్ అవార్డు తెచ్చి పెట్టింది. అదే సంవత్సరం విడుదలైన 'ఉమ్రావ్ జాన్' రేఖ ఒక ఉత్కృష్టమైన నటిగా ప్రపంచానికి చాటింది. ఈ సినిమాకు జాతీయ ఉత్తమ నటి పురస్కారం దక్కాక ఇక రేఖ గురించి విమర్శకులు ఎప్పుడూ తక్కువ చేసే పరిస్థితి రాలేదు. రేఖ ఇప్పుడు అన్ని విధాలుగా పరిపూర్ణమైన నటి.

•••

రేఖను చాలా తెలివితేటలతో, గ్లామర్‌తో, పరిశ్రమతో ఇండస్ట్రీలో నిలిచింది తప్ప నిజానికి ఇండస్ట్రీ ఆమె టాలెంట్‌ను ఎప్పుడూ పూర్తిగా ఉపయోగించుకోలేదు. పెద్ద నిర్మాణ సంస్థలూ పెద్ద దర్శకులు ఆమెను సపోర్ట్ చేయలేదు. శ్యామ్ బెనగళ్ 'కలియుగ్' (1981), గిరిష్ కర్నాడ్ 'ఉత్సవ్' (1984), ఆస్థా (1997) రేఖకు చెప్పుకోవడానికి మిగిలాయి. ఆ తర్వాత ఆమె యాక్షన్ సినిమాలకు మళ్లి 'ఖూన్ భరీ మాంగ్', 'ఫూల్ బనే అంగారే' వంటి సినిమాలు చేసి 'లేడీ అమితాబ్' అనిపించుకునే వరకూ వెళ్లింది. ఒక దశలో ఆమె అమితాబ్‌లాగా కాస్ట్యూమ్స్ కూడా ధరించేది.

•••

రేఖ అన్‌స్టాపబుల్. అన్‌లిమిటెడ్. ఆమె 'కల్ హోన హో', 'క్రిష్' వంటి సినిమాల్లో తల్లి/బామ్మ పాత్రలు పోషించినా ప్రేక్షకులు ఎప్పుడూ నల్లజుట్టు రేఖనే ఇష్టపడ్డారు. ఆమె తన ఆకృతిని, ఫిట్‌నెస్‌ని 70 ఏళ్ల వయసు వచ్చినా ఎప్పుడూ కోల్పోలేదు. నేటికీ ఆమె ప్రత్యేకమైన ఫొటోషూట్స్ చేస్తూ కవర్‌గర్ల్ గానే ఉంది. ఇలా హాలీవుడ్ నటీమణులకు చెల్లింది గానీ మన దేశంలో రేఖకు మాత్రమే సాధ్యమైంది.

రేఖ గొప్ప డాన్సర్. పాటలు బాగా పాడుతుంది. కవిత్వం రాస్తుంది. ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది. 'నేను ప్రేమిస్తే సంపూర్ణంగా ప్రేమిస్తాను' అనే రేఖ ప్రేక్షకులకు కూడా అంతే సంపూర్ణంగా ప్రేమ అందించడం వల్లే నేటికీ నిలబడి ఉంది.

ఈ గొప్ప యోధ, కళాకారిణి తెలుగువారి అమ్మాయి కూడా కావడం తెలుగువారు గర్వపడాల్సిన విషయం.

రేఖకు జన్మదిన శుభాకాంక్షలు. •

మన(సు)లో మాట

గంజాయ్‌తోనే ఎంజాయ్ అనుకుంటున్నాడు!

మా అబ్బాయి బీటెక్ ఫైనల్ ఇయర్‌లో ఉన్నాడు. గత రెండు సంవత్సరాల నుంచి వాడు కాలేజీకి సరిగా వెళ్లడం లేదు. మూడీగా... చికాకుగా ఉంటున్నాడు. బ్యాక్‌లాగ్స్ ఉన్నాయి. ఇంటిని, ఒంటిని నీట్‌గా ఉంచటం లేదు. రూములో ఒంటరిగా ఉంటున్నాడు. ప్యాంట్ జేబులో ఏవో పొట్లాలు దొరికాయి. ఇవేమిటని నిలదీస్తే, అప్పుడు చెప్పాడు... తాను గంజాయికి అలవాటు పడ్డానని, గంజాయి లేకుండా ఉండలేనని. అది విని మేము చాలా షాకయ్యాం. ఒక్కడే అబ్బాయని వాడు అడిగిందల్లా కాదనకుండా ఇచ్చాము. మంచి స్టూడెంట్. చివరకు చదువంతా పోయి, ఇలా గంజాయికి బానిసయ్యాడని చాలా బాధగా ఉంది. వాళ్ళ ఫ్రెండ్స్ కూడా చాలామంది ఇలాగే గంజాయికి అలవాటు పడ్డారని చెప్పాడు. మా వాడిని ఈ గంజాయి మత్తులోంచి బయటపడేసే మార్గం చెప్పండి డాక్టరుగారూ!

– కృష్ణవేణి, విజయవాడ

మొదట సరదాగా స్నేహితులతో కలిసి ఆరంభించి, చివరకు ఇది ఒక పెద్ద సమస్యగా 'అడిక్షన్' స్థాయికి తీసుకెళ్తుంది. గంజాయి తీసుకున్నప్పుడు కిక్కు లోనవుతారు. అది ఊహల్లో విహరించి, గాలిలో తేలిపోయేటట్లు భ్రమలు, భ్రాంతులలో ముంచెత్తి చివరకు ఉన్మాద స్థితికి తీసుకెళ్తుంది. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, తెలివితేటలు మందగించటంతో మొదలై... చివరకు 'కెన్నాబిస్‌సైకోసిస్' అనే తీవ్రమైన మానసిక రుగ్మతకు దారితీస్తుంది. ఇలాంటి వారిని తల్లిదండ్రులు త్వరగా గుర్తించి సరైన చికిత్స చేయిస్తే దాంట్లోంచి బయటపడతారు. సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో మందులు, కౌన్సెలింగ్ ద్వారా వీరిని పూర్తిగా బాగు చేయవచ్చు. అవసరమైతే 'డీ అడిక్షన్' రిహాబిలిటేషన్' కేంద్రంలో కొంతకాలం ఉంచాల్సి ఉంటుంది. మీకు దగ్గర్లోని మానసిక వైద్యుడిని సంప్రదిస్తే మీ అబ్బాయి ఈ ఊబిలోంచి బయటపడి, మళ్ళీ పూర్తిగా మామూలు మనిషి అయేట్లు వారు చేయగలరు. విష్ యు ఆల్ ది బెస్ట్.



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ.

మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com



రమాదేవి

* బతుకమ్మ

'చిత్తూ చిత్తూల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ ..'
'కలవారి కోడలు ఉయ్యాలో...
కడుగుతున్నది పప్పు ఉయ్యాలో...'
తెలంగాణ అంతటా బతుకమ్మల దగ్గర
రమాదేవి భక్తి పాటలు మార్మోగుతుంటాయి.
దేవాలయాల వద్ద దేవతల పౌరాణిక కథనాలు
పాటల వెల్లువై ప్రవహిస్తుంటాయి.
ఇరవై ఏళ్లుగా వెయ్యికి పైగా భక్తి, పురాణేతిహాసాల
పాటలు పాడి అలరిస్తున్నారు హైదరాబాద్ వాసి రమాదేవి.
దేవీ నవరాత్రుల సందర్భంగా రమాదేవి
పంచుకున్న విశేషాలు.

ఊరూ వాడా ఉయ్యాల పాటనై

''బతుకమ్మ పండగకు మా ఊళ్లో అడుగుపెడుతూనే 'రామ రామ రామ ఉయ్యాలో ... రామ ఓ శ్రీరామ ఉయ్యాలో...' అంటూ నేను పాడిన పాటలు నాకు స్వాగతం పలుకుతుంటాయి. ముస్తాబైన ఆడవాళ్లందరూ బతుకమ్మల చుట్టూ తిరుగుతూ అవే పాటలను కోరస్‌గా పాడుతుంటారు. 'ఏమీమి పువ్వప్పునే గౌరమ్మ...' అంటూ పాట తర్వాత పాట వింటూ బతుకమ్మలను కొలుస్తుంటే ఆ సమయంలో నా గొంతు అందరి గొంతుక అవడం చెప్పలేనంత సంబురంగా అనిపిస్తుంటుంది. అంతటితో ఆగకుండా చుట్టూ ఉన్నవారంతా మైకులు ఆపేసి, నాచేత పాటలు పాడించుకుంటారు. నేనూ వారితో కలిసి పాడి, ఆడి ఆనందిస్తాను. నవరాత్రుల సందర్భంగా తెలంగాణ ఊరూవాడలా బతుకమ్మ ఎక్కడ కొలువుదీరినా అక్కడ నా పాట రూపంలో నేనుండటం ఈ జన్మకు నాకు దక్కిన అదృష్టం.

ప్రతి దైవానికీ...

నేను పుట్టి పెరిగింది కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో... డిగ్రీ వరకు చదువుకున్నాను. స్కూల్ రోజుల్లో జెండావందనం నుంచి ప్రతి వేడుకలో నా పాట ఉండేది. కాలేజీ రోజుల్లోనూ నా పాటలు విన్నవారు అక్కడక్కడా అవకాశాలు ఇచ్చేవారు. ఆ తర్వాత జానపద గీతాలు, పౌరాణికాలు, గణపతి, దుర్గ, శివుడు, రాముడు, అయ్యప్ప, సాయిబాబా... ఇలా ప్రతీ దైవానికి సంబంధించినవే కాదు గ్రామదేవతలపైనా పాటలు పాడాను. ఈ రికార్డ్స్ అన్నీ తెలంగాణ దేవాలయాల్లో నేటికీ వినిపిస్తుంటాయి. కొన్ని ప్రాంతాల ప్రత్యేకత, చారిత్రక కథనాల నేపథ్యంగా రచయితలు రాసిన పాటలు పాడాను. 20 ఏళ్లుగా ఈ పాటల తోటలో విహరిస్తున్నాను. వెయ్యికి పైగా పాటలు పాడగలగటం.. నాకు దక్కిన వరంగా భావిస్తున్నాను. ఇటీవల గణపతిపైన పాడిన 'గౌరమ్మ తనయుడు గణపతి చరితం వినరమ్మ..', దుర్గమ్మను స్తుతిస్తూ 'అష్టాదశ పీఠాలలోన ఆదిశక్తివి అయ్యి అవతరించినవో మా అమ్మ దుర్గమ్మ!' పాటలకు మంచి స్పందన వచ్చింది. జానపద బాణీలు, దేవుళ్ల కథనాలకు సంబంధించిన పాటలు అంటే రమాదేవి ఆల్బమ్ ఉంది అనేంతగా గుర్తింపు వచ్చింది.

చూసి నేర్చుకోమనేవారు..

వినాయక చవితి నవరాత్రుల్లోనూ నేను పాడిన పాటలకు డీజె మిక్స్ చేసి డీజె మిక్స్ చేసినవి పెడుతుంటారు. ముఖ్యంగా... అన్ని పూలను కొలుస్తూ ఉండే 'ఒక్కేసి పువ్వేసి సందమామ... అనే పాటను, చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దుల గుమ్మ.... ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా!' ఉయ్యాల పాటలు బాగా ప్రాచుర్యం పొందాయి. ఇటీవల ప్రాచీన కాలం నుంచి వస్తున్న జానపద పాటలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. వీటిలో సీతాదేవి, శ్రీకృష్ణుడు, రాముడు, శివుడు మీద జానపద బాణీలలో ఉయ్యాల పాటలు ఉన్నాయి. నా గళానికి అవార్డులతో పాటు జానపద రత్న పేరుతో ఎంతో మంది చేత ప్రశంసలు అందుకున్నాను. చదువుకునే రోజుల్లో పాటలు పాడటానికి ఊరి నుంచి స్టూడియోలకు వెళుతుంటే మా అమ్మ కేతమ్మ, నాన్న ఓదేలుతో 'ఆడపిల్లను అలా బయటకు పంపిస్తున్నారు, ఇబ్బందులు పడతారు జాగ్రత్త!' అని కొంత మంది హెచ్చరించేవారు. కానీ, మా నాన్న వాళ్ల మాటలను పట్టించుకోలేదు. వాళ్ల నమ్మకాన్ని నిలబెట్టిన. మంచి పేరు వచ్చిన తర్వాత ఊళ్లోవాళ్లు తమ పిల్లలకు నా గురించి గొప్ప గా చెప్పేవారు.

పెళ్లయిన తర్వాత పాటలు పాడటం తగ్గిపోతుంది అనుకున్నారు. కానీ, మా వారు కిశోర్ రచయిత, సింగర్ కూడా కావడం నా గళానికి మరింత మద్దతు లభించింది. పదేళ్ల క్రితం తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యోగావకాశం లభించింది. కానీ, నాలాంటి కళాకారులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని వదిలేశాం. ఇప్పుడు కళాకారులందరికీ ఉద్యోగావకాశాలు రావాలని కోరుకుంటున్నాం.'' అంటూ వివరించారు రమాదేవి.



– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

పూలతో ఆడపిల్ల ఇంటిని వెలిగిస్తుంది



జయధీర్ తిరుమలరావు

నేడు సద్దుల బతుకమ్మ.
తెలంగాణ అంతటా స్త్రీలు పూలతో బతుకమ్మలను పేర్చి
ఆటపాటలతో గౌరమ్మను కొలుస్తారు.
ఈ సందర్భంగా స్థానిక సంస్కృతిలో బతుకమ్మ విశిష్టతను వివరిస్తున్నారు
ప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు జయధీర్ తిరుమలరావు.

ఆదివాసీ సంస్కృతులలో అమ్మతల్లి ఆరాధన గురించి..?

ఆదివాసీ సంస్కృతిలో, వారి జీవితంలో స్త్రీ దేవతారాధన విడదీయరానిది. ఆదివాసీలలోనే కాదు శ్రామిక జీవితంలో, జానపద సమాజంలో అమ్మదేవతలు విశిష్ట స్థానంలో ఉంటారు. ఆదిమ కాలంలో వ్యవసాయానికి స్త్రీలే పునాది వేశారు. బీజం, క్షేత్రం స్త్రీ అనుభవం. పునరుత్పత్తి భావనకి స్త్రీ ఆలంబన. విత్తనాలు నాటడం, కలుపు తీయడం, కోత కోయడం అంతా స్త్రీలే. పొలంలో పంట తీయడం, గర్భంలో శిశువుని మోయడం రెండూ స్త్రీల వంతే. అంతేకాదు, దానికి కావలసిన భాషని సృజించుకున్నదీ స్త్రీయే. భాషని సాహిత్యీకరించినదీ వారే. అనేక రకాల పాటలు పాడటం, పూజకు కావల్సిన కర్మకాండని తీర్చిదిద్దినదీ వారే. ఆ విధంగా స్త్రీ అనేక రంగాలలో, అనేక రూపాలతో తన శక్తి సామర్థ్యాలను వ్యక్తం చేసింది. మహత్తులను చూపి అమ్మదేవతారాధనకి ఆలంబన అయ్యింది. ఒక్కో అంశానికి ఒక్కో దేవతని ఏర్పరుచుకుని ఆయా రుతువులలో, పంటల కాలంలో దేవతారాధన చేశారు. ఆయా దేవతలను జ్ఞాపకం చేసుకోవడం, పూజించడం, రాబోయే తరాలకు వారిని జ్ఞాపకం చేయడం జరుగుతోంది. మాతృస్వామ్య వ్యవస్థ ప్రాధాన్యత అమ్మతల్లి ఆరాధనకు పట్టుగొమ్మ. అందులో భాగమే బతుకమ్మ. జన్మనిచ్చి, బతకడానికి అన్ని రకాలుగా చేయూతనిచ్చే ఆరాధన ఉంది. ప్రస్తుత కాలంలో ఆదివాసుల సమ్మక్క సారలమ్మలు, మైదాన ప్రాంతాల బతుకమ్మ పండగలు రోజు రోజుకూ ప్రాచుర్యం పొందుతున్నాయి.

ఈ పరంపరను ఎలా అర్థం చేసుకోవాలి?

బతుకమ్మ పండగ ప్రధానంగా తెలంగాణ స్త్రీల పండగ. దీనినే పూల పండగ అంటారు. ఎలాంటి బలి తంతు లేకుండా జరిగే క్రతువు. ఆ రోజు శాకాహారమే. బతుకమ్మలో ఆహారం, నృత్యం, పాట, సంగీతం అన్నీ సమపాళ్లలో కలగలసి ఉంటాయి. చాలారకాల ఆదివాసుల నృత్యాలు వర్తులాకార నృత్యాలే. పాల్గొనే స్త్రీలు అందరూ గుండ్రంగా చేరతారు. గుండ్రంగా కదులుతూ వంగుతూ, లేస్తూ, చప్పట్లు కొడుతూ చక్కని సంగీతాన్ని సృష్టిస్తారు. వారు తమ శరీర లయకు అనుగుణంగా పాటల్ని పాడతారు. ఒకరు ప్రధాన గాయనిగా పాటని అందుకుంటే మిగతావారు సామూహికంగా లయాత్మకంగా పాట పాడతారు. బొడ్డెమ్మ, బతుకమ్మ వంటి ఆటపాటలలో, పండగలో స్త్రీలదే ప్రధాన పాత్ర. ఈ పండగలో స్త్రీలు అందరూ సమానమే.

పాటల రాగం చేతులతో చప్పట్లు మోగించే శైలిలో పాడబడుతుంది. ఇదే విధానం తెలంగాణ అంతటా కనిపించడం విశేషం. ప్రతిరోజు కొత్త ధాన్యంతో రకరకాల పిండివంటలు చేసి అందరూ కలిసి పంచుకుని భుజించడం ఆనవాయితి. ఇక్కడ కులాల, అంతస్తుల ప్రమేయం కనిపించదు. కాని మారిన కాలంలో కులాలవారీగా కట్టుకున్న అపార్ట్‌మెంట్ల మాదిరిగా అక్కడక్కడా కులభావన కనిపించడం మరీ ఆధునికం.

కాని బతుకమ్మ పండగలో స్త్రీల సంప్రదాయ బలం లోతు చాలా ఎక్కువ. అందుకే దేశంలోని వేరే రాష్ట్రాలలో జరిగే పూల పండగల కన్నా ఎంతో విలక్షణంగా, ప్రత్యేకంగా నేటికీ జరుగుతున్నది. ఈ పరంపర తెలంగాణకి ప్రత్యేకం. సుమారు వేయి సంవత్సరాల చరిత్ర దీనికి ఉందని చెప్పవచ్చు. పండగ సందర్భంగా సోదరిని పుట్టింటికి తీసుకురావడం అనే ఆచారం కూడా కొనసాగడం గమనించాలి.

బతుకమ్మ ఆంధ్ర, రాయలసీమలో ఎందుకు కానరాదు?

నిజానికి పూల పండగ మనదేశంలో కేరళ రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాలలో జరుపుతారు. విదేశాలలో కూడా జరుపుతారు. అంటే పూలను ప్రేమించడం, సేకరించడం, ఊరేగించడం, తలమీద ఎత్తుకుని తీసుకుపోవడం అనే ఆచారం ఉంది. కానీ తెలంగాణాలో జరిగే రీతి రివాజు మరెక్కడా కనపడదు. బతుకమ్మ పండగ విధానం కాదు. అది స్వభావం. దాని లక్ష్యం కుటుంబ అభివృద్ధి. స్త్రీని అత్తవారింటికి పంపి ఊర్కోవడం కాదు. పెళ్లి తదితర ఫంక్షన్లకి రావడం కాదు. హక్కుగా తల్లిగారింటికి వచ్చి పూలతో ఇంటిని వెలిగించడం ముఖ్యం. అన్న లేదా తమ్ముడు సోదరిని తోలుకుని వచ్చి గౌరవించడం, కట్నకానుకలను పెట్టడం తప్పనిసరి. ఇలాంటి సంప్రదాయాలు వేరే చోట్ల బలంగా కనబడవు. కాని పూలను పేర్చి పండగ చేయడం కృష్ణానది కింద చూశాను. ప్రకృతి ఆరాధన కూడా ఈ పండగలో ఒక ముఖ్య భాగం. నిండిన చెరువుల దగ్గర, కుంటల దగ్గర, జలాశయాల దగ్గర ఆట ఆడి ఆ నీటిలోనే పూలను కలుపుతారు. ఏ జలం ఆధారంగా పూసిన పువ్వులు ఆ జలానికే అంకితం కావడం ఒక గొప్ప తాత్వికత. ఇక్కడ ఆడపిల్లలు బొడ్డెమ్మలు ఆడతారు. ఆంధ్రాప్రాంతంలో గొబ్బెమ్మలు ఆడతారు.

తెలంగాణ గ్రామీణంలో దసరా ప్రత్యేకత ఏమిటి?

దసరా మంచికి, చెడుకి మధ్య జరిగిన యుద్ధం. జమ్మిచెట్టు చిన్నదే. కాని పాండవులు తమ ఆయుధాలు దానిపై దాచి ఉంచారు. కాబట్టి జమ్మి ఆకుని 'బంగారం' అంటారు. ఆ ఆకుని ఇచ్చిపుచ్చుకుని అలాయి బలాయి తీసుకుంటారు. అదేరోజు సాయంకాలం చాలా చోట్ల రావణుడి బొమ్మని తయారు చేసి, దానిని కొలుస్తారు. అలా కాకుండా చాలా ఆదివాసీ ప్రాంతాలలో సమూహాలలో రావణుడిని పూజిస్తారు. అక్కడ మనలా దసరా పండగ జరపరు.

తెలంగాణలో దసరా పండగ రోజున మద్యం, మాంసం తప్పనిసరి. బంధువులు, స్నేహితులతో కలిసి పేదలు సైతం పండగని ఘనంగా జరుపుకుంటారు. కుల భావన లేకుండా ఆలింగనం చేసుకుంటారు. కొన్ని తావులలో వైషమ్యాలు మరిచి కలసిపోతారు. బతుకమ్మ పండగకి ఇంటికి సోదరి వస్తుంది. దసరాకి అల్లుణ్ణి పిలుచుకుంటారు. లేదా సోదరిని దసరాకి అత్తగారింటికి పంపిస్తారు. ఆ విధంగా తెలంగాణలో దసరా అతి పెద్ద పండగ.

ఈ రెండు పండగలు ఒకే రుతువులో ఒకే వారంలో, ఒకదాని తరువాత మరొకటి జరగడం గమనించాలి. బతుకమ్మ స్త్రీల పండగ. దసరా ఒక రకంగా పురుష ప్రధానమైన పండగ. •